క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ప్రయోజనం


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ

హాలియా : ముఖ్యమంత్రి సహాయ నిధితో పేదలకు ఎంతో ప్రయోజనం కలుగుతోందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి పేర్కొన్నారు. నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 23 మందికి సీఎం సహాయ నిధి నుంచి సుమారు రూ.6,48,500 లక్షల విలువ గల చెక్కులు మంజూరు కాగా వాటిని శుక్రవారం హాలియాలో ఆయన లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సంఘం అధ్యక్షుడు వర్ర వెంకట్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ ఎక్కలూరి శ్రీనివాస్ రెడ్డి, నిడమనూరు పీఏసీఎస్ డైరెక్టర్ కేశబోయిన జానయ్య గౌడ్, హాలియా బీఆర్ఎస్ అధ్యక్షుడు వడ్డె సతీష్‌రెడ్డి, నాయకులు దోరేపల్లి వెంకటేశ్వర్లు, హబ్దుల్ హాలీం, ఆంజాద్‌ఖాన్, బందిలి పెద్ద సైదులు, రావులపాటి ఎల్లయ్య, జలీల్ పాషా ఉన్నారు.

తాళ్లగడ్డ సీలింగ్ భూముల పరిశీలన

మిర్యాలగూడ: పట్టణంలోని సర్వే నంబర్ 60, 61లలో గల ప్రభుత్వ సీలింగ్ భూమిని శుక్రవారం సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ పరిశీలించారు. ఇటీవల ప్రభుత్వ సీలింగ్ భూములను కాపాడాలంటూ పలువురు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేయడంతో ఆయన భూములను పరిశీలించారు. ప్రస్తుతం 3.14 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమి ఉందని, సర్వే చేసి గుర్తించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ హరిబాబు, ఆర్ఐలు సత్యనారాయణ, రామకృష్ణ ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మిర్యాలగూడ టౌన్ : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పతంజలి యోగా గురువు, నిర్వాహకులు పొలిశెట్టి లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని రామచంద్రాగూడెంలో గల మీనా ఇంజనీరింగ్ కళాశాలలో పతంజలి యోగా ఆధ్వర్యంలో విద్యార్థినులకు యోగాసనాలు వేయించారు. ఆయన వెంట శిక్షకులు కేవీ సూర్యారావు తదితరులున్నారు.

దాతల సహకారం అభినందనీయం

గుర్రంపోడు : ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహాయం అభినందనీయమని మండల విద్యాధికారి నోముల యాదగిరి అన్నారు. శుక్రవారం గుర్రంపోడు మండలంలోని పిట్టలగూడెం ప్రాథమిక పాఠశాలకు చింతరెడ్డి యాదగిరి రెడ్డి-రంగమ్మల స్మారకార్థం వారి కుమార్తెలు రూ.30వేల ఖర్చుతో సమకూర్చిన ప్రహరీ గేటును దాతలతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం ఎస్. యాదయ్య, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నర్సింహ, పంచాయతీ కార్యదర్శి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ కిట్స్ పంపిణీ

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్థానిక నాట్కో ట్రస్ట్ ప్రతినిధులు శుక్రవారం డ్రాయింగ్ కిట్స్ పంపిణీ చేశారు. పైలాన్‌కాలనీలోని బస్టాండ్ ప్రాథమిక పాఠశాల, హిల్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో జరిగే ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ తరగతులకు హాజరయ్యే 60మంది విద్యార్థులకు కిట్స్ అందజేసినట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్లు వాసు, మధుసూదన్,ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గగణేశ్వరి,యశోద ఉపాధ్యాయులు వెంకన్న నర్సింహారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధురాలిని కుమారులకు అప్పగింత

మిర్యాలగూడ: తన బాగోగులు చూడకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ రెండు రోజుల క్రితం దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామానికి చెందిన వృద్ధురాలు తాడోజు లక్ష్మమ్మ సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో లక్ష్మమ్మ కుమారులు నరసింహాచారి, వినోదచారిలను శుక్రవారం అధికారులు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. తల్లిని ఇబ్బందులు పెడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి హెచ్చరించారు. కౌన్సిలింగ్ అనంతరం ఆమె కుమారుల్లో పరివర్తన రావడంతో తల్లిని వారికి అప్పగించారు. కార్యక్రమంలో అధికారులు మునగాల నాగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్, సునీల్ ఉన్నారు.

పౌష్టికాహారం పంపిణీపై నిర్లక్ష్యం వహించొద్దు

త్రిపురారం : అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే పౌష్టికాహారం పంపిణీపై నిర్లక్ష్యం వహించొద్దని త్రిపురారం మండల ప్రత్యేక అధికారి వందనం శ్రీదేవి సూచించారు. శుక్రవారం మండలంలోని బెజ్జికల్ గ్రామంలో ఆకస్మికంగా పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. పౌష్టికాహారాన్ని పరిశీలించి చిన్నారులతో ముచ్చటించారు. అనంతరం గ్రామ పంచాయతీలో రికార్డులను పరిశీలించారు. నర్సరీ, శ్మశానవాటిక, డంపింగ్ యార్డు, వర్మికంపోస్ట్ షెడ్డు, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో త్రిపురారం ఎంపీడీఓ విజయ కుమారి, ఏపీఓ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాలకు ఎన్నికలు ఎప్పుడో?

- చివరిసారిగా 2006లో ఎన్నికల నిర్వహణ
- పట్టించుకోని ప్రభుత్వాలు
- అధ్వానంగా మారుతున్న చెరువులు


నాయినివానికుంట చెరువు

పెద్దవూర: పదహారేళ్లుగా నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో చెరువులు అధ్వానంగా మారాయి. మరోవైపు మిషన్ కాకతీయ పథకంలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం చెరువులు, కుంటలకు మరమ్మతులు చేసినా.. వాటిపై ఆజమాయిషీ లేక నీటి విడుదల, మరమ్మతులపై దృష్టి పెట్టేవారు కరువయ్యారు. చెరువుల అభివృద్ధికి గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మిషన్ కాకతీయ పథకానికి శ్రీకారం చుట్టింది. ఒకప్పుడు చెరువుల అభివృద్ధి, నిర్వహణ, ఆయకట్టుకు నీటి విడుదల తదితర పర్యవేక్షణ పనులను నీటి సంఘాల పాలకవర్గాలు చేపట్టేవి. పదహారేళ్లుగా ప్రభుత్వాలు నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించకపోవడంతో వాటి పర్యవేక్షణ కరువైంది.

గతంలో ఇలా..

గతంలో ప్రభుత్వాలు 100 ఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధాన చెరువులకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేవి. ఈ ఎన్నికల్లో రైతులు నీటి సంఘం చైర్మన్‌తో పాటు డైరెక్టర్‌లను ఎన్నుకునేవారు. పాలకవర్గ సభ్యులు చెరువుల నిర్వహణతో సాగు నీటిని పంట పొలాలకు విడుదల చేసుకుని పొదుపుగా వాడుకునేలా చర్యలు తీసుకునేవారు. నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో చెరువుల నిర్వహణ అధ్వానంగా మారింది. కొన్ని చెరువుల తూములు, పంట కాలువలు, అలుగులు శిథిలావస్థకు చేరుకున్నాయి. తూములు పనిచేయక సాగునీరు రాక నిరుపయోగంగా మారాయి.

2008 నుంచి ఎన్నికలు బంద్

మండలంలో 15 చెరువులు ఉండగా వీనిలో 100 ఎకరాలకు పైగా సాగు నీటిని అందించేవి ఐదు చెరువులు ఉన్నాయి. వెల్మగూడెంలోని రాగిచెరువు, మొండికట్టల చెరువు, బసిరెడ్డిపల్లిలోని ఉత్తరం చెరువు, సంగారంలోని నల్లచెరువు, తెప్పలమడుగులోని ఇమాంకుంట, చలకుర్తి ఊరచెరువు, చింతపల్లిలోని చింతలచెరువు, పర్వేదుల గ్రామ చింతలచెరువు, శిర్శనగండ్ల ఊరచెరువు, పెద్దవూర గ్రామంలోని ఊరచెరువు, నాగులచెరువు, తుంగతూర్తి ఊరచెరువు, పోతునూరులోని రాగిచెరువు, ఉత్తరచెరువు, చలకుర్తి(ప్రత్యేక ఎత్తిపోతల పథకం)లు ఉండగా వీనిలో పెద్దవూర, తుంగతూర్తి, చలకుర్తి, శిర్శనగండ్ల, పోతునూరు గ్రామాలలోని చెరువులు వంద ఎకరాలకు పైగా సాగునీటిని అందిస్తున్నాయి. 2006వ సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా వంద ఎకరాల ఆయకట్టుకు పైగా ఉన్న ప్రధాన చెరువులకు రెండు సంవత్సరాల కాలానికి గాను సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించారు. వాటి పదవీకాలం 2008లో ముగిసింది. అప్పటినుంచి తిరిగి ఎన్నికలు నిర్వహించిన దాఖలాలు లేవు.

నీటి సంఘాలతోనే చెరువుల అభివృద్ధి



నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను ఎన్నుకుంటేనే చెరువులు అభివృద్ధి చెందుతాయి. గతంలో నీటి సంఘాల ఉండటం వలన నీటిని పొదుపుగా వాడుకోవడమే కాకుండా వాటి పర్యవేక్షణ కూడా పకడ్బందీగా ఉండేది. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం పేరుతో చెరువులను అభివృద్ధి చేసినా ఆజమాయిషీ లేకపోవడంతో కాంట్రాక్టర్‌లు ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారు. ప్రభుత్వం నీటి సంఘాలపై దృష్టి సారించాలి.

– గాలి సైదిరెడ్డి, రైతు, కొత్తగూడెం

నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తాం

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


నేలవాలిన పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : మిర్యాలగూడ, దామరచర్ల మండలాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించి ఆదుకుంటామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మిర్యాలగూడ, దామరచర్ల మండలాల్లో అకాల వర్షాల కారణంగా నేలవాలిన పంట పొలాలను వ్యవసాయాధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులెవ్వరూ అధైర్యపడవద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు


చింతపల్లిలో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ శ్రీరాములు

చింతపల్లి: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు సూచించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతు నుంచి పత్తిని కొనుగోలు చేసేందుకు సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్రాల నిర్వహకులు రైతులకు అన్ని వసతులను కల్పించాలని సూచించారు.ఆయన వెంట సిబ్బంది, తదితరులు ఉన్నారు.

చిన్న తరహా పరిశ్రమల పరిశీలన


చింతపల్లి మండల కేంద్రంలో చిన్న తరహా పరిశ్రమను పరిశీలిస్తున్న అధికారులు


దేవరకొండ : బతుకమ్మలతో సివిల్ సర్వీస్ ప్రొబేషనరీ అధికారులు

చింతపల్లి: మండల కేంద్రంలోని చిన్న తరహా పరిశ్రమలను శుక్రవారం ఆలిండియా సివిల్ సర్వీస్ ప్రొబేషనరీ అధికారులు పరిశీలించారు. మండల కేంద్రంలోని 10 లక్షల రూపాయల రుణంతో కొనసాగుతున్న చిన్న తరహా పరిశ్రమను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామపంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్వీస్ ప్రొబేషనరీ అధికారులు సుమన్ నాలా, కుడియారసు, దిగ్విజయ్ సింగ్, నివేదన్, పూర్ణిమ సుడెన్, ఎంపీడీఓ సుజాత, గ్రామ కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

ముదిగొండలో..

దేవరకొండ: దేవరకొండ మండలం ముదిగొండలో సివిల్ సర్వీస్ ప్రొబేషనరీ అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ప్రభుత్వ పథకాల అధ్యయనంలో భాగంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, అందుబాటులో ఉంచిన ఆటవస్తువులను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అన్నప్రాసన, అక్షరాభ్యాసంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఆ తర్వాత గిరిజన సంప్రదాయ వీరేనాపాటో ధరించి బతుకమ్మలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులున్నారు.

ముగిసిన అధ్యయనం

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల పరిధిలోని పెండ్లిపాకల గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సివిల్ సర్వీస్ ప్రొబేషనరీ అధికారులు అధ్యయనం శుక్రవారంతో ముగిసింది. గ్రామంలో ప్రజల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును బృందం సభ్యులు తెలుసుకున్నారు. వారి వెంట కొండమల్లేపల్లి ఎంపీడీఓ బాలరాజురెడ్డి, నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి ధన్‌సింగ్ తదితరులున్నారు.

ప్రతి గీత కార్మికుడికి సేఫ్టీ కిట్ అందజేస్తాం

- సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి


గీత కార్మికులకు కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

హాలియా : నాగార్జున సాగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రతీ గీత కార్మికుడికి విడతలవారీగా కాటమయ్య కిట్ (సేఫ్టీకిట్) అందజేస్తామని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి తెలిపారు. బీసీ కార్పొరేషన్ నల్లగొండ, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం హాలియాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన గీత కార్మికులకు సేఫ్టీకిట్లు ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. నియోజకవర్గంలో మొదటి విడతగా 100 కిట్లు మంజూరయ్యాయని, దశలవారీగా గీత కార్మికులందరికీ సేఫ్టీకిట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో హాలియా, నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, అంకతి సత్యం, హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్ యడవెల్లి అనుపమనరేందర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, కాకునూరి నారాయణ గౌడ్, కుందూరు వెంకట్‌రెడ్డి, కృష్ణనాయక్, గౌనీ రాజా రమేష్ యాదవ్, ఎక్సైజ్ సీఐ కల్పన నాయకులు ధనావత్ భాస్కర్‌నాయక్, వెంపటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించి ఆదుకుంటామని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అనుముల మండలంలోని మాదారిగూడెం గ్రామంలో అకాల వర్షానికి దెబ్బతిన్న పంట పొలాలను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చంద్రశేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు యడవెల్లి నరేందర్‌రెడ్డి, ఏఓ సరిత వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పరిహారం అందేలా చూస్తాం

త్రిపురారం : అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా చూస్తామని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నిడమనూరు మండలంలోని గుంటుకగూడెం, ముప్పారం గ్రామాల్లో వర్షం కారణంగా నేల వాలిన వరి పంటను పరిశీలిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. కార్యక్రమంలో నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, నందికొండ మట్టారెడ్డి, నూకల వెంకట్‌రెడ్డి, బోల్లం శ్రీనివాస్ యాదవ్, వెంకటరమణ, తరి నర్సింహ, అల్లంపల్లి మైసయ్య, పగాళ్ల శివ, కోటేష్, వీరేషం, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు

సాక్షి ఎఫెక్ట్

త్రిపురారం : ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ గాజుల ప్రమీల హెచ్చరించారు. మండలంలోని కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూముల ఆక్రమణపై శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో 'ప్రభుత్వ భూములపై పట్టింపేది' శీర్షికతో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించి ఆ భూములను పరిశీలించారు. కంపాసాగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 12లోని భూముల్లో అనుమతులు లేకుండా మట్టి తోలిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గాజుల ప్రమీల మాట్లాడుతూ మైనింగ్ అనుమతులు ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు వ్యక్తులు ఇంటి నిర్మాణానికి మట్టి తోలుకున్నారన్నారు. గ్రామస్తులతో మాట్లాడి ప్రభుత్వ భూముల్లో మట్టి తోలకాలు చేపట్టవద్దని చెప్పామన్నారు. ఆమె వెంట ఆర్ఐ సంతోష ఉన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలి


వెల్మగూడెంలో పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న డీటీడీఓ రాజ్‌కుమార్

పెద్దవూర: గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, మండల ప్రత్యేక అధికారి రాజ్‌కుమార్ అన్నారు.శుక్రవారం ఆయన మండలంలోని వెల్మగూడెం గ్రామ పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జెడ్పీహెచ్ఎస్, ఆరోగ్య ఉపకేంద్రం ,సెరిగేషన్ షెడ్, వైకుంఠధామం, వన నర్సరీలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం, జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుపట్టికలను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు అమలు చేస్తున్న మెనూ సక్రమంగా పాటించి నాణ్యమైన భోజనాన్ని అందించాలని అన్నారు. హరితహారంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించలన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం, జ్వరాల కేసులు, డంపింగ్ యార్డు, గడ్డి కటింగ్ యంత్రాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారిణి మానె ఉమాదేవి, ఏపీఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు


మాట్లాడుతున్న డీఎం రమేశ్‌బాబు

దేవరకొండ: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని దేవరకొండ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక డీలక్స్ బస్సులు నడుపనున్నట్లు దేవరకొండ డిపో మేనేజర్ తల్లాడ రమేశ్‌బాబు తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచారామ క్షేత్రాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట క్షేత్రాలకు 3,10,17,24 తేదీల్లో (ప్రతి ఆదివారం రాత్రి 8గంటలకు) డిపో నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. నవంబర్ 15వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా 14వ తేదీ రాత్రి 8గంటలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా నవంబర్ 13న తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదర్శనకు సైతం బస్సులు నడుస్తాయన్నారు. పంచారామ క్షేత్రాలకు డీలక్స్ బస్సు చార్జీలు రూ.2వేలు(పెద్దలకు), రూ.1200 (పిల్లలకు) ఉంటుందన్నారు. బుకింగ్ కోసం సెల్:7382833031, 7382833070లో సంప్రదించాలని కోరారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని ధర్నా


రాజీవ్ చౌక్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్ : పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని రాజీవ్‌చౌక్ వద్ద మహాధర్నా చేశారు. అంతకుముందు ఏబీవీపీ నగర శాఖ అధ్యక్షుడు మధు మోహన్‌రాజు ఆధ్వర్యంలో బ్ల్యూవెల్ ప్యాలెస్ నుంచి రాజీవ్ చౌక్ వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సంపత్ , మిర్యాలగూడ నగర శాఖ అధ్యక్షుడు బొల్లేపల్లి మధు మోహన్‌రెడ్డి, మహిళ కన్వీనర్ ప్రణవి మాట్లాడుతూ తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న 7,800 కోట్ల రూపాయలను విడుదల చేయకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శ్రీకాంత్, యశ్వంత్, అశ్విని, కార్తీ, సిరి, వంశీ, మల్లేశ్వరి, శ్రీవిద్య, అభి, మధు, కళామంచ్, విజయ్, ప్రియాంక, హర్షిణి, తేజశ్రీ, సౌమ్య, మనోజ్, గణేష్, దయాకర్ తదితరులున్నారు.

కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని వినతి

హాలియా: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్ల ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, లెక్చరర్లు ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డిని సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కళాశాలల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాకీర్ హుస్సేన్, లెక్చరర్లు సంజీవరెడ్డి, శిల్ప, ఆదిరెడ్డి, హరికృష్ణ, లింగమూర్తి, బాలరాజు, వెంకట్ నాయక్, మంగమ్మ ఉన్నారు.

శిలాఫలకాన్ని ధ్వంసం చేశారని ఫిర్యాదు


పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

వేములపల్లి(మాడ్గులపల్లి) : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాడ్గులపల్లి మండలంలోని కల్వెలపాలెంలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు వేసిన శిలాఫలకాన్ని కొందరు అధికార పార్టీ నాయకులు ధ్వంసం చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ మండల నాయకులు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శిలాఫలకంపై అప్పటి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, మాజీ ఎంపీపీ పోకల శ్రీవిద్యరాజు పేరు ఉండడంతో జీర్ణించుకోని కొందరు నాయకులు రాళ్లతో పేర్లను ధ్వంసం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో పోకల రాజు మారుతి వెంకట్‌రెడ్డి, గడ్డమీది సైదులు, వెంకటాచారి, పుల్లెంల కొండలు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపిక


దైద శ్రీనివాస్


సురేందర్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్తలు దైద శ్రీనివాస్, పోలేపాక సురేందర్ మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లాబాయి పటేల్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. పట్టణ పరిసరాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడంతో హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ, సింధూ ఆర్ట్ అకాడమీ వారు సేవలను గుర్తించి ఈ జాతీయ పురస్కారానికి ఎంపిక చేశారు. వీరు ఈనెల 27వ తేదీన హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాజు ఆడిటోరియంలో మంత్రి పొన్నం ప్రభాకర్, వికలాంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

మిర్యాలగూడ టౌన్ : విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి ర్యాంకులను సాధించాలని మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి నీరుకంటి నారాయణ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, క్రీడా తదితర సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ సంఘం నేత గోపనబోయిన నాగమణి, కుప్పాల సుబ్బారావు, వీరయ్య, వెంకటేశ్వర్లు, శివ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేములపల్లి(మాడ్గులపల్లి) : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్‌కు చెందిన బొల్లికొండ కృష్ణ ప్రభుత్వ అనుమతులు లేకుండా పాలేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలి పారు. ట్రాక్టర్ యజమాని కృష్ణతోపాటు, డ్రైవర్ కిరణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

దేవరకొండ: దేవరకొండ మండల పరిధిలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో బాలికల హాస్టల్‌లో సహాయ వంట మనిషి పోస్టుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దేవరకొండ ఎంఈఓ మాతృనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అభ్యర్థులు ఏడవ తరగతి చదివి ఉండి స్థానికులై ఉండాలని ఆయన తెలిపారు. అర్హులైన వారు ఈనెల 30వరకు స్థానిక ఎమ్మార్సీలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

చందంపేట : గ్రామ స్థాయిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని చందంపేట మండ స్పెషల్ ఆఫీసర్ సామ్యూల్ జాకోబ్ సూచించారు. శుక్రవారం మండలంలోని హంక్యతండ, ముర్పునూతల గ్రామాల్లో ఇటీవల కాలంలో చేపట్టిన పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు, క్రిమిటోరియం వంటి తదితర పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ లక్ష్మి, వైద్యాధికారి చందులాల్, ఏపీఓ వరలక్ష్మి, మాజీ సర్పంచ్ కొర్ర రమేష్‌నాయక్ ఉన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్‌లో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో సమగ్ర కులగణనను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అయిలి వెంకన్నగౌడ్, దుర్గయ్య, మణిమంజరి, సంధ్య తదితరులున్నారు.

27న యాదవ సంఘం సమావేశం

చింతపల్లి: మండల కేంద్రంలోని సాయిసుమంగళీ గార్డెన్లో ఈ నెల 27న చింతపల్లి మండల అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడి ఎన్నిక సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ జెడ్పీటీసీ జంగిటి నరసింహ తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మర్ల వెంకటయ్య యాదవ్,దాసరి శ్రీనివాస్ యాదవ్ ,శివర్ల రమేష్ యాదవ్,పల్ల వెంకటయ్య యాదవ్,గుణమోని కొండల్ యాదవ్,దాసరి నిరంజన్ యాదవ్,ః.రాములు యాదవ్,ముడిగా వెంకటయ్య యాదవ్,దాసరి రాజు యాదవ్, గంగల వెంకటయ్య యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులపై ఆరోపణలు సరికాదు

మిర్యాలగూడ: బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం సరికాదని ఆ పార్టీ నాయకులు హాతీరాం, బాలాజీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 70 ఏళ్లలో చేయని అభివృద్ధిని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ చేసి చూపించారని అన్నారు. కార్యక్రమంలో రవినాయక్, రవీందర్, ప్రకాశ్‌నాయక్, సాధినేని శ్రీనివాస్, శ్రీనివాస్‌యాదవ్, వినోద్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు ఫర్నిచర్ బహూకరణ

మిర్యాలగూడ: మండల పరిధిలోని శ్రీనివాస్‌నగర్ గురుకుల పాఠశాలకు భోగవెల్లి సునీత మెమోరియల్ ఫౌండేషన్ ప్రతినిధి భోగవెల్లి వెంకటరమణచౌదరి శుక్రవారం రూ.2లక్షల విలువ చేసే టేబుల్స్, కుర్చీలు, ర్యాక్స్, రూ.1లక్ష విలువ చేసే స్టడీ మెటీరియల్, బుక్స్‌ను అందజేశారు. అనంతరం వెంకటరమణచౌదరిని పాఠశాల ఆర్‌సీఓ, ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం


కొండమల్లేపల్లిలో వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కొండమల్లేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్ అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కొండమల్లేపల్లి మండల కేంద్రంలో శుక్రవారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్‌నాయక్, పొట్ల రాకేష్, జై చరణ్, జోనలగడ్డ చరణ్, శరత్, ఆంజనేయులు, ఇద్దిరాములు, సరస్వతి, మౌనిక, ఆరాధ్య, జ్యోతి, హారిక, అంజలి పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలని వినతి

మిర్యాలగూడ : రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేసేంతవరకు పోరాడుతామని ఎస్ఎఫ్ఐ దామరచర్ల మండల కార్యదర్శి వీరన్ననాయక్ అన్నారు. శుక్రవారం దామరచర్ల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల సవతితల్లి ప్రేమ చూపిస్తుందని అన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయకుండా పేద విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుకుంటుందన్నారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్, సింహాద్రి, కిట్టు, గణేష్, విష్ణు, రాహుల్ తదితరులు ఉన్నారు.

వేములపల్లి: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్ట సంపత్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో కార్తీక్, శివ, మణి, సాయి, శంకర్ ఉన్నారు.